# మోహన గీతం

ఢిల్లీ నుండి అంతకు ముందు రోజు విజయవాడ వచ్చి బంధువులింట్లో వున్న మనవరాలు గీత తమ దగ్గరకు వస్తుందని తెలిసి ఏ సమయంలో వస్తుందోనని ఎదురుచూస్తూ హనుమాయమ్మగారు గుమ్మం దగ్గిరే కూర్చున్నారు.

హనుమాయమ్మగారి పెద్దకొడుకు ప్రస్తుతం ఢిల్లీలో వుంటున్నాడు. ఉద్యోగంలో చేరినప్పటినుండి ఉత్తరాది వేపే వుంటున్నారు వాళ్ళు. వాళ్ళమ్మాయే గీత.

హనుమాయమ్మగారి కూతురు, అల్లుడు అమెరికాలో వుంటున్నారు. వాళ్ళబ్బాయి మోహన్ ఎమ్.ఎస్. చేసి అమెరికా వెళ్ళడానికిష్టపడక సొంత ఊళ్ళోనే ప్రాక్టీసు ప్రారంభించి, తమకున్న భూముల్లో వ్యవసాయమూ చేయించుకుంటున్నాడు. అతనికి సాహిత్యంపట్ల అభిరుచి వుంది. అపుడప్పుడూ కథలూ రాస్తుంటాడు.

హనుమాయమ్మగారు అతనిదగ్గరే వుంటున్నారు. ఆవిడ రెండో కొడుకు నెల్లూరులో బిజినెస్ చేస్తుంటాడు. ఇంటర్, టెన్త్ చదువుతున్న రెండోకొడుకు పిల్లలు కూడా సెలవులకు హనమాయమ్మగారి దగ్గరకు రెండు రోజుల క్రితమే నెల్లూరునుండి వచ్చారు.

మోహన్‌కీ, గీతకూ పెళ్లిచేసే ఉద్దేశ్యం పెద్దవాళ్ళకు వుంది. గీత ఆ ఊళ్ళో వుండగలదో లేదో అన్ని విషయాలూ ఆలోచించి తననే నిర్ణయించుకోమని గీతని తల్లిదండ్రులు అక్కడికి పంపించారు. కాసేపటిలోనే గీత రావడంతో ఇంట్లో సందడి పెరిగింది. అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. "ఈ రోజు బస్‌స్టాండ్‌లో జరిగిన తమాషా చెప్పనా?" అడిగింది గీత.

విజయవాడలో వాళ్ళ బంధువులబ్బాయి గీతని బస్ స్టాండ్‌లో డ్రాప్ చేసి తనకి అర్జెంటు పనివుందని చెప్పి బస్సు వచ్చేవరకూ వుండకుండా వెళ్లిపోయాడు. ఇంగ్లీషు, హిందీ తప్ప గీతకి తెలుగు చదవటం రాదు. ఇంట్లో నేర్చుకున్నది ఎప్పుడో మర్చిపోయింది. అందుకే బస్సు ముందు రాసి వున్న ఊరిపేరు ఏమిటని పక్కనే కూరగాయలబుట్టతో నిలబడి వున్నావిడను అడిగితే ఊరిపేరు చెప్పాక ఆవిడ చిన్న లెక్చర్ కూడా ఇచ్చిందట.

"నాకసలు చదువే రాదనుకుంది కాబోలు. 'చిన్నప్పుడు బడికి వెళ్ళనని మరాం చేసి చదువుకోకపోయినా ఇపుడైనా నాలుగు అక్షరాలు నేర్చుకోమ్మా' అంటూ ఉచిత సలహా ఇచ్చింది! పైగా తనుకూడా పెద్దవాళ్ళ బడిలో చేరి రాయడం, చదవడం ఈ మధ్యనే నేర్చుకున్నానని చెప్పి నన్నూ అలాగే చేయమంది" అంటూ గీత నవ్వుతూంటే అందరూ శృతి కలిపారు.

మోహన్ కూడా నవ్వుతూనే గీతతో "ఆవిడేదో అమాయకంగా నీకు సలహా ఇచ్చిందనుకుంటున్నావుగానీ .. తెలుగువాళ్ళకి తెలుగు రాకపోతే వాళ్ళు నిరక్షరాస్యులేనని ఆవిడ ఉద్దేశ్యం అయివుంటుంది. నిజం చెప్పాలంటే, నా అభిప్రాయం కూడా అదే!" అన్నాడు. అందరూ నవ్వుతూంటే గీత మాత్రం మొహం ముడుచుకుంది.

ఆ మరునాడు హనుమాయమ్మగారు గీతకి చెప్పారు "బావతో పెళ్ళి నీకిష్టమైతే 'ఈ ఊరు నాకు నచ్చింది' అని నాకు చెప్పు. ముహూర్తాలు పెట్టుకోవడానికి మీ అమ్మావాళ్ళని రమ్మంటాను. ఇష్టం లేకపోతే 'అమ్మావాళ్ల దగ్గరికి వెళ్తాను' అని చెబితే నాకర్ధమవుతుంది. నీ సంగతి తెలిశాకనే మోహన్‌ని అడుగుతాను" అని.

అలాగే అన్నట్లుగా గీత తల వూపింది.

ఆ ఊరు ఒకవైపు పంటపొలాలతో పచ్చపచ్చగా పల్లెటూరు వాతావరణంతోనూ, ఇంకొకవైపు సినిమాహాల్సు, షాపులతో పట్నం పోకడతోనూ వుంటుంది. వారం రోజులు అందరూ సినిమాలకీ, పొలాల్లో షికార్లకీ తిరిగారు. గీతకి ఆ ఊరు నచ్చింది. మోహన్ మరీ నచ్చాడు. తన చదువు తన ఊరువాళ్ళకీ ఉపయోగపడాలనే అతని ఆశయమూ నచ్చింది. అందుకే హనుమాయమ్మగారు చెప్పినట్లే తన అంగీకారం తెలిపింది.

ఆవిడ సంబరపడిపోతూ క్షణం కూడా ఆలస్యం చేయకుండా హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటున్న మోహన్ దగ్గరకెళ్ళి కూర్చుని "గీత గురించి నీ ఉద్దేశ్యం ఏమిటిరా?" అనడిగారు.

మోహన్ చిరునవ్వుతో "బొద్దూ ప్లస్ మొద్దూ" అన్నాడు.

"ముద్దమందారంలా ముద్దుగా ఉండే పిల్లని బొద్దంటావేంట్రా... ఇంకా సన్నబడాలనుకుంటే, మన పొలానికి నాలుగుసార్లు తిరిగితే చాలు! డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసైతే మొద్దెలా అవుతుందిరా నీ మొహం!"

"తెలుగక్షరాలు కూడా తెలీక బస్సుమీద రాసివున్న ఊరిపేరు ఇంకొకరితో చదివించుకోవాల్సొచ్చింది!" ఎగతాళిగా అన్నాడు మోహన్.

"తెలుగు మాట్లాడుతుందిగా. రాయడం, చదవడం రానంతమాత్రాన అదొక సమస్యా?" హనుమాయమ్మ గారు కాస్తంత చిరాకుపడ్డారు.

"కొందరికి కాకపోవచ్చుగానీ పాతకాలపు భావాలున్న నాలాటివాడికి మాత్రం సమస్యే. ఊరికెళ్లిన భార్య మధురమైన మాతృభాషలో రాసిన ఉత్తరాన్ని ఇష్టంగా చదువుకోవాలనే కోరిక తీరే అవకాశం వుండదుగా!" విచారాన్ని అభినయిస్తూ నిట్టూర్చాడు.

గుమ్మం దగ్గరే కొంచెం వెనగ్గా నిలబడివున్న గీత చటుక్కున హాల్లోకి వచ్చి "అమ్మమ్మా... బావ ఏమనుకుంటున్నాడు... నేను ఉత్తరమే రాయలేనా..?! ఇపుడు మర్చిపోయాను గానీ నాకూ వచ్చు. నాలుగు రోజులు ఒత్తులు, గుణింతాలు ప్రాక్టీసు చేస్తే చాలు. అంతెందుకు రేపీపాటికే తెలుగులో ఉత్తరం రాసి చూపిస్తాను తెలుసా?" అంది రోషంగా.

లీల, వేణు చేతులు పైకెత్తి "అక్కా, బావ స్టన్నయిపోయేట్లుగా ఓ లవ్ లెటర్ రాసెయ్యి" అంటూ అరిచారు.

"చూద్దాంగా" అంటూ మోహన్ నవ్వాడు.

ఆ మర్నాడు అందరూ హాల్లోనే కూర్చున్నపుడు వేణు "పోస్ట్" అని అరుస్తూ మోహన్ ఒడిలో ఒక కవర్ పడేశాడు.

అంటించని ఆ కవరులో నుండి కాగితాన్ని తీసి చూస్తూనే మోహన్ తలపట్టుకున్నాడు.

అందరూ ఆశ్చర్యంగా చూస్తోంటే, మోహన్ "అమ్మమ్మా... నీ ముద్దుల మనవరాలు నన్నెలా ఎద్దేవా చేసిందో తెలుసా? నన్నొకనీచుడి కింద జమకట్టేసింది. 'హేయమైన బావా' అని రాసింది' అన్నాడు.

అందరూ నవ్వుతూంటే గీత తత్తరపడుతూ "ప్రి అనే అక్షరం గుర్తురాక వేణునడగితే, నా చేతిలో వున్న పుస్తకంలో చూపించిన అక్షరాన్నే రాశాను" అంది.

"నేను సరిగానే చూపించాను. పొరపాటున పై లైనులోని అక్షరాన్ని చూసి రాసిందేమో!" నవ్వు దాచుకుంటూ తనదేం తప్పులేదన్నట్లుగా వివరణ ఇచ్చాడు వేణు.

"ఈ ఉత్తరంలో 'మనమిద్దరం కవరులో కవరు పెట్టినట్లుగావుంటామని నానమ్మ అంటోంది' అని రాసింది" అంటూ మోహన్ మళ్లీ నవ్వాడు.

హనుమాయమ్మగారు గీతవైపు అయోమయంగా చూస్తూ "ఒకరికోసం ఒకరు పుట్టినట్లుగా వుంటారనికదూ నేనన్నానూ...?! అదే రాస్తానంటే సరే అన్నా! అంతేగా!" అన్నారు.

"ఆ మాటకొచ్చిన తిప్పలు ఇదన్నమాట!" అని గీత వైపు కొంటెగా చూసి "రెండోవాక్యం కూడా చదవనా? ఒద్దులే... సిగ్గుపడతావ్!" అన్నాడు.

"ఎందుకూ సిగ్గుపడటం? తప్పుల్ని మాత్రం ఎగతాళిగా చదివి కరెక్ట్‌గా రాసింది మాత్రం చెప్పడం లేదంతే" అంది గీత.

వేణు మోహన్ దగ్గరకెళ్ళి "బావా... నేను ముందే చెప్పేస్తున్నాను. అక్క ఇంగ్లీషులో ఒక సెంటెన్స్ చెప్పి తెలుగులోకి ట్రాన్స్‌లేట్ చేయమంటే చేశాను. 'నువ్వూ, నీ ప్రేమా నాక్కావాలీ' అని కరెక్ట్‌గానే చెప్పాను మరి!" అన్నాడు.

"అయితే ఈ ఉత్తరంలో చాలామంది మేధావుల సలహాలూ, సంప్రదింపులూ వున్నాయన్నమాట! అందుకే ఇంత రసవత్తరంగా వుంది!" అంటూ భుజాలెగరవేస్తూ అందరివైపూ చూసి మళ్ళీ అన్నాడు.

"నువ్వు ప్రేమగా నాకాలీ అని రాసింది" అన్నాడు.

మోహన్ వైపు కోపంగా చూస్తూ "నువ్వు కావాలనే అలా చదువుతున్నావ్!" అంది.

"నన్ను నన్నుగా అనటానికి కాబోలు నున్ననున్నగా అని రాశావ్! కావాలంటే అందరినీ చూడమను..." అంటూ మోహన్ చూపించబోతోంటే గీత అతని చేతిలోని కాగితాన్ని లాక్కుని నలిపేసింది.

"అబ్బో... చమత్కారాలు అందులో ఇంకా చాలానే ఉన్నాయి! నీ మరదలు అనడానికి వరదలు అని రాసింది! ఈ ఉత్తరాన్ని చదివిన వాళ్ళెవరైనా సరే నవ్వుల వరదలో కొట్టుకుపోవాల్సిందే!" అంటూ పెద్దగా నవ్వుతూనే "అమ్మమ్మో, గీతతో నా కథల్ని గనుక ఫెయిర్ చేయిస్తే గొప్ప కామెడీ కథలుగా మారిపోతాయి!" అన్నాడు.

గీత హనుమాయమ్మ గారికి ఫిర్యాదు చేస్తూ "చూడు నానమ్మా... బావ ఎలా మాట్లాడుతున్నాడో, నాకు మనసు దంచుకుపోతోంది!" అంది.

ఆవిడ బుగ్గలు నొక్కుకుంటూ ఆశ్చర్యంగా "దంచుకుపోవడమేమిటే...?" అనడిగారు.

మోహన్ ఒక క్షణం ఆలోచించి "దహించుకుపోవడం అయ్యుంటుంది" అని సరిదిద్దాడు.

"చోద్యం కాకపోతే, అలాంటి పెద్దమాటలు ఎందుకే, మామూలుగా మాట్లాడొచ్చుగా!" కొంచెం విసుక్కుంటున్నట్లుగా హనుమాయమ్మగారు అనగానే, వేణు ఆవిడ దగ్గరకు వచ్చి కూర్చుని మొదలు పెట్టాడు.

"అసలు సంగతి నే చెప్పనా? గీతక్క మొదట్లో ఈట్ చేయటం, స్లీప్ చేయటం లాంటి మాటలుపయోగిస్తోంటే, ఏదో ఒక భాషలో మాట్లాడమని బావ చిరాకుపడ్డాడు. అందుకని ఇంగ్లీషుపదాలు రాకుండా జాగ్రత్తపడుతూ, పెద్ద పెద్ద పదాల్ని ఉపయోగించి తనకు తెలుగు బాగా వచ్చిందని బావని ఇంప్రెస్ చేయాలనుకుంటోంది!" అని చెప్పి మోహన్ వైపు తిరిగి –

"బావా – పుస్తకాల్లోని చాలా మాటలకు అర్థాలు తెలీక అక్క మమ్మల్ని అడుగుతూంటుందిగా, మొన్న 'మిక్కుటముగా' అంటే 'ఎక్కువగా' అని చెప్పేసరికి ఆ రోజు నానమ్మ తన పళ్లెంలో వడ్డించిన అన్నాన్ని చూసి మిక్కుటముగా వుందని అంది తెల్సా!" అంటూ పెద్దగా నవ్వాడు.

మొహం చిన్నబుచ్చుకుని కూర్చున్న మనవరాలి వైపు ప్రేమగా చూస్తూ "ఇంట్లో వున్న తెలుగు పుస్తకాల్ని అస్తమానూ తిరగేస్తూ, ఏదో రాసి చూసుకుంటూంటే, నాలుగురోజుల్లో ఇట్టే నేర్చేసుకున్నావనుకున్నా! అదేమిటే మరి, ఉత్తరాన్ని అన్ని తప్పులతో రాశావు?" అనడిగారు.

గీత రోషంగా చూస్తూ "సరిగ్గా వారం రోజులకి తప్పుల్లేకుండా మళ్ళీ రాసి చూపిస్తాను చూడు" అంది.

"ఉత్తరం వద్దుగానీ ఒకే ఒక్క వాక్యం ఎందులోనూ చూడకుండా, సొంతంగా తప్పుల్లేకుండా రాసి చూపించు. చాలు!" అన్నాడు మోహన్.

గీత సీరియస్‌గా మొహం పెట్టి "అలాగే, రాయలేక పోతే, అమ్మావాళ్ళని రావద్దని చెప్పి నేనే వెళ్ళిపోతాను! ఇది నా..." అంటూ ఆగిపోయింది.

"ఛాలెంజ్ అనే మాటకి తెలుగు గుర్తుకురాక అక్కడ డేష్ పెట్టేసింది. 'శపథం' అనే పదంతో డేష్‌ని పూర్తి చేసుకోండి" వేణు అనగానే అందరూ నవ్వారు.

"ఆపండి నవ్వులు. దానికి తెలుగు రాకపోయినంత మాత్రాన నష్టమేం లేదులే.." అంటూ హనుమాయమ్మగారు వాళ్ళని కసురుకున్నారు కానీ ఆ మరునాడే నష్టం వుందనే సంగతి నిరూపణ అయింది.

మోహన్ క్లినిక్‌కి వెళ్ళాడు. బంధువులు పిండివంట చేయడానికి రమ్మంటే హనుమాయమ్మగారు వెళ్ళారు. గీత రానన‌డంతో లీల, వేణు మార్నింగ్ షోకి వెళ్లారు. టీ.వీ. చూస్తూ గీత ఒక్కతే ఇంట్లోవుంది.

పుట్టింటికి వెళ్లిన రజకుడు వీరన్న భార్యకి బాగాలేదని, అర్జెంటుగా ఆపరేషను చేయాలని డాక్టరు చెప్పారనే కబురొచ్చింది. అతను హనుమాయమ్మగారిని వెతుక్కుంటూ వెళ్ళి తనకి రావాల్సిన డబ్బిమ్మని అడిగాడు. పని మధ్యలో వదిలి వెళ్ళలేక అతనికివ్వాల్సిన మూడువందల ముప్ఫైరూపాయల్ని ఇమ్మని చీటీ రాసిచ్చి ఇంటికి పంపించిందావిడ.

ఆ కాగితాన్ని తప్పుగా చదివి మూడు వేల మూడు వందల రూపాయలిచ్చి గీత పంపించిందనే విషయం హనుమాయమ్మ గారికి ఇంటికి రాగానే తెలిసింది.

"ఇలా చేశావేమిటి... మూడువేలని వాడి దగ్గర్నుండి ఎప్పటికి రాబట్టుకుంటాం!" అంటూ ఆవిడ కోపంగా విసుక్కునేసరికి గీతమొహం చిన్నబుచ్చుకుని సంజాయిషీగా చెప్పింది. "ఊరుకెళ్ళి ఆపరేషన్ కోసం డబ్బు వెతుక్కోవాలి. బస్సు టైమయిపోతోందంటూ హడావుడి పెట్టేసరికి తొందరలో సరిగా చదవలేకపోయాను. అతను కూడా చూసుకోకుండా చేతిలో డబ్బు అలాగే పట్టుకుని పరుగు పెట్టేశాడు"

అవకాశం దొరికిందన్నట్లుగా మోహన్ ఆవిడ మాట అప్పచెప్పాడు. "నిన్ననేగా అమ్మమ్మా, తెలుగు రానంతమాత్రాన నష్టం ఏముందీ అన్నావ్. ఇపుడు తెలిసిందా?"

నవ్వుతూన్న మోహన్‌వైపు కోపంగా చూసి అక్కడ నుండి వెళ్లిపోయింది గీత.

వారం రోజుల తర్వాత గీత తన చేతిలో పెట్టిన కాగితాన్ని చూసి చదువుతూనే "వా...వ్" అంటూ ఆనందాశ్చర్యాల్తో మోహన్ అరిచాడు. అందర్నీ పిలిచాడు.

"అమ్మమ్మా... గీత మాట నిలబెట్టుకుంది. ఒక్క తప్పయినా లేకుండానేకాదు, మంచి అర్థంతో చక్కగా రాసింది. చదువుతా విను. 'సంసారగీతం సమ్మోహనంగా సాగటానికి అనురాగ స్వరాలు చాలవా, అక్షరమాల అవసరమా?' అని రాసింది. పెళ్లి చేసుకోవడానికి ఇద్దరికీ ఇష్టముండటమే ముఖ్యమని చెబుతూ నాకొక చురక తగిలించింది కూడా!"

మోహన్ మాటలకు హనుమాయమ్మ గారి మొహం వెలిగిపోయింది!

"హమ్మయ్య! నాకొక సమస్య తీరిపోయింది. అబ్బాయినీ, కోడల్నీ ముహూర్తాలు పెట్టుకోవడానికి రమ్మని రాత్రికి ఫోను చేస్తాను" సంబరంగా అంటూ లోపలికి వెళ్ళిపోయిందావిడ.

"మా అక్క అంటే ఏమిటనుకున్నావ్ బావా ... సాధించింది చూశావా?!" అంటూ లీల, వేణు గెంతులేశారు.

కాసేపటి తర్వాత గీత మోహన్ దగ్గరకు వచ్చి "బావా, అమ్మావాళ్ళని రావద్దని చెబుతాను. నేనే రేపు వెళ్లిపోతున్నాను" అంది. సంగతేమిటన్నట్లుగా మోహన్ విస్మయంగా చూశాడు.

నసుగుతూ మెల్లగా చెప్పింది "తప్పుల్లేకుండా నేను రాయలేకపోవటం చూసి లీల రాసిచ్చింది. అది నేను సొంతంగా రాసింది కాదు... చూచిరాత మాత్రమే!"

మోహన్ చిరునవ్వుతో "అయినా ఫర్వాలేదు. సరదాగా అనుకున్న పందెం. అంతేగా!" అన్నాడు.

"వద్దు. నేనన్నదానికి నేను కట్టుబడి వుంటాను. నీ కోరిక నాకు తెలుసు. నీ కథల్ని చదివి చక్కని సలహాలిస్తూ ఫెయిర్ చేయగలిగే తెలుగు బాగా వచ్చిన అమ్మాయిని చేసుకోవడమే నీకు ఆనందాన్నిస్తుంది!" మొహం పక్కకు తిప్పుకుని రుద్ధకంఠంతో అంది గీత.

మోహన్ చిన్నగా నవ్వాడు. "నీకో నిజం చెప్పనా? అలాంటి అర్థంలేని పంతంతో నాకు దూరమవుతావేమోనని భయమేసి లీలకు నేనే రాసిచ్చాను నీకు చూపించమని. మనిద్దరిమధ్యా జరుగుతున్న ఈ సరదా సంగతుల స్ఫూర్తితో నేను రాయడం మొదలు పెట్టిన కథలోనిదే ఆ వాక్యం. తెలుగు రాయడం, చదవడం నాలుగు రోజుల్లో కాకపోతే నలభైరోజుల్లో వస్తుంది... ఇబ్బందేం లేదు! నా కోసం నేర్చుకోవాలని తాపత్రయపడ్డావు. అది చాలు నాకు.

నీకింకో విషయం కూడా చెప్పనా! అప్పుకోసం ఊరెళ్ళాక మళ్ళీ ఏం తిప్పలు పడతాడులే అనే ఉద్దేశ్యంతో వీరన్నకు నువ్వు తెలిసే ఎక్కువ డబ్బిచ్చి, పెద్దవాళ్ళకు ఏదో సర్దిచెప్పుకుంటానని నువ్వన్నమాట బస్‌స్టాండ్‌లో కనిపించి నాకు చెప్పాడు. నీ మనసూ బంగారంలాంటిదని తెలిశాక ఆ రోజే అత్తయ్యకూ, మామయ్యకు నా అంగీకారం చెప్పేశాను!"

కళ్లు పెద్దవి చేసిచూస్తూ "నిజమా...?!" అంది. "ఇపుడు నా మనసు ఆనందంతో.." ఏమనాలో తెలియనట్లుగా వాక్యం పూర్తి చేయకుండా ఆగిపోయింది.

"కుంగిపోతోంది అనకు. పొంగిపోతోంది అనాలి" అన్నాడు.

"ఏయ్ మళ్ళీ తప్పులు చెబుతున్నావ్... పొయ్యిమీద పెట్టిన పాలుగదా పొంగుతున్నాయంటారూ...?" అంది గీత.

మోహన్ నవ్వుతూ "ప్రేమసెగకి నీ మనసు గిన్నెలోని పాలు పొంగుతున్నాయన్నమాట!" అన్నాడు.

"సెగ అంటే...?"

గీత తలమీద సరదాగా మొట్టి "నీ బొంద..." అని – "బొంద అంటే అర్థం ఏమిటని మళ్ళీ అడగకు. నాకూ తెలియదు మరి" అన్నాడు నవ్వుతూ.

"నానమ్మా అంతే... బొంద, సింగినాదం అంటూ మాట్లేడేస్తుంది. అర్థాలేమిటంటే తెలియవంటుంది! నన్ను ఎగతాళి చేస్తారుగానీ అసలు మీకే తెలుగు పూర్తిగా రాదు" అంటూ నవ్వింది గీత.

స్వాతి వీక్లీ. 30, మార్చి 2007